నాణ్యమైన హెల్మెట్లనే వినియోగించండి



హెల్మెట్ అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

గోల్కొండ: ప్రమాద సమయంలో వాహనదారుడి ప్రాణాలను కాపాడే సాధనం హెల్మెట్ అని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. ఆదివారం టోలిచౌకి వీనస్ హైస్కూల్‌లో డ్రాక్స్ ఎస్ సొసైటీ సహకారంతో విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు హెల్మెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్జీవోలు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. హెల్మెట్ పెట్టుకునే వారు బెల్ట్ క్లిప్ పెట్టుకోవడం లేదని, దీని వల్ల ద్విచక్ర వాహనచోదకుడు కింద పడినప్పుడు హెల్మెట్ పడిపోయే ప్రమాదం ఉందన్నారు. వాహనచోదకులు నాణ్యమైన ఐఎస్ఐ ముద్ర కలిగిన హెల్మెట్‌లనే వాడాలని, ఐఎస్ఐ గుర్తు ఉన్న హెల్మెట్లను ఎన్నో పరీక్షల అనంతరం తయారు చేస్తారని చెప్పారు. వీనస్ హైస్కూల్ కరెస్పాండెంట్ హిదాయతుల్లాన్ ఖాన్ మాట్లాడుతూ.. డ్రాక్స్ స్కూల్ సొసైటీ వారు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ వారితో కలిసి ఈ హెల్మెట్లు అందిస్తున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న విద్యార్థి తండ్రితో పాటు విద్యార్థికి వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. డ్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నీమ్‌కార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 12వేల హెల్మెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలక్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జునైదీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంధులకు టోల్ ఫీ మినహాయింపునకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కావ్య కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: అంధుల పేరుపై రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు టోల్ ఫీ మినహాయింపు కోసం కృషి చేస్తానని వందేభారత్ వ్యవస్థాపకురాలు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంధులకు రూ.3 లక్షల వరకు ఐటీ మినహాయింపు ఇచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అదనపు సర్టిఫికెట్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. త్వరలో దివ్యాంగుల కవి సమ్మేళనం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న దివ్యాంగులను సన్మానించారు. కార్యక్రమంలో జనహిత వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఉమామహేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, మహిళా విభాగం కార్యదర్శి నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ముస్తాఫానగర్, షేక్ కీ మసీద్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నాణ్యతతో కూడిన విద్యనందించడమే లక్ష్యం



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించడమే లక్ష్యమని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు తాము విద్యనభ్యసించిన కళాశాల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.మారెడ్డి, ఓయూ ప్రొఫెసర్ ప్యాట్రిక్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గార్డెన్స్‌లో సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాలు చేస్తున్న మహిళలు

నాంపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పతాంజలి యోగ్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సూర్య భగవానుడిని నమస్కరిస్తూ 75 సూర్య నమస్కారాలు చేశారు. ప్రతి ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పతాంజలి యోగ్ సమితి అధ్యక్షురాలు మంజుశ్రీ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా యోగ్ సమితి ప్రతినిధులు రోజ, నీలం త్రిపాఠి, నిర్మల, మొదాని, అలకనంద పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నాంపల్లి: రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రి ఎదుట రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. సినీ నటుడు లక్ష్మీనారాయణ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా గుణం దేవుడిచ్చిన వరం అన్నారు. రెడీ సర్వ్ ఫౌండేషన్ ఇలాంటి సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ.. 2011లో ప్రారంభించిన ఫౌండేషన్ ద్వారా ఎంతో మందికి సాయం చేస్తున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు, వృద్ధాశ్రమాల్లో మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ ప్రకాష్, శివ చైతన్య, ప్రశాంత్, బీటీ నాయుడు, పీఆర్వో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవం

చార్మినార్: చెలాపురాలోని దక్షిణ మండలం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జానకమ్మతో పాటు ఎస్ఐ అనిత, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, సిబ్బందిని సలావుద్దీన్ సత్కరించి స్వీట్ బాక్స్ అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీశ్వర్‌గౌడ్, మహ్మద్ అమీర్, మెహజబీన్ ఖురేషి, అనూషాగౌడ్, కృష్ణమాలిక్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



‘మేరు కుల సంఘం ఎన్నికలు నిర్వహించాలి’



సమావేశంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: రాష్ట్ర మేరు సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సంక్షేమాన్ని గాలికి వదిలేసి సభ్యుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని సంఘం జేఏసీ ప్రతినిధులు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో రాష్ట్ర మేరు జేఏసీ కన్వీనర్ మునిగాల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో అధికారమే పరమావధిగా వ్యవహరిస్తూ గత 11 సంవత్సరాలుగా రాష్ట్ర మేరు సంఘాన్ని, మేరు కులస్థుల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. మేరు కుల మేధావులు, యువత సంఘం సభ్యులను ప్రశ్నించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నిసార్లు విబేధాలు పక్కన పెట్టి చర్చించినా ఫలితం లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఒకే వేదికపైకి వచ్చి మేరు సంఘం జిల్లా, నియోజకవర్గ, మండలాల ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు వెంకటరాజ్యం, లింబాద్రి, పాండు, విష్ణు, రవితేజ, ప్రకాష్, దామోదర్, శాంతికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాంసం షాపుల యజమానులకు నోటీసులు



మాంసం వ్యాపారికి నోటీసు అందజేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

చార్మినార్: వీధి కుక్కలు మాంసం షాపుల సమీపంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, కవర్ల నియంత్రణ, మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని ఆదేశిస్తూ అధికారులు షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు ఆదివారం జీహెచ్ఎంసీ అధికారులు చార్మినార్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నోటీసులు అందించారు. యాకుత్‌పురా, తలాబ్‌కట్టా తదితర ప్రాంతాల్లో మాంసం, చేపల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు.

‘తెలిసినవాళ్ల నుంచే లైంగిక వేధింపులు అధికం’



జడ్జి రాధారాణిని సన్మానిస్తున్న అతిథులు

గన్‌ఫౌండ్రీ: సమాజంలో ఏం జరుగుతుందో ప్రతి మహిళ తెలుసుకోవాలని హైకోర్టు జడ్జి రాధారాణి అన్నారు. సమాజంలో 90 శాతం లైంగిక వేధింపులు తెలిసినవాళ్ల నుంచే ఎదురవుతున్నాయన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వి ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు చదువుతో పాటు ధైర్యం ఉండాలని సూచించారు. పేదరికంలో ఉన్నటువంటి మహిళలను ఉద్యోగాల పేరుతో లైంగికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న మహిళలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో గాయని కౌసల్య, ఎన్‌సీసీ అధికారి జయసుధ, సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రతిభలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి



సమావేశంలో పాల్గొన్న ముక్తార్ హుస్సేన్ తదితరులు

సుల్తాన్‌బజార్: వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తార్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించి, కబ్జా అయిన ఆస్తులను బోర్డుకు తిరిగి ఇప్పిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యి 9 ఏళ్లు అవుతున్నా నేటి వరకు బోర్డు ఆస్తులను ఇప్పించలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల కోట్ల వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, నేటి వరకు కబ్జాదారులపై ఎలాంటి చర్యలు లేవన్నారు. హిందువులకు ఎండోమెంట్ వలే వక్ఫ్‌బోర్డుకు కమిషనరేట్, జ్యుడీషియల్ పవర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇస్తామన్న 12 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని, పేద ముస్లిం యువతకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. మణికొండలోని 1600 ఎకరాల వక్ఫ్ బోర్డు స్థలాన్ని పరిరక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్దీఖి, నయిమ్‌ఉల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సరఫరాలో కోతలుండవ్

గోల్కొండ: వేసవిలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని టోలిచౌకి పరిసర బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నీటి సరఫరాపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నీటి సరఫరాలో ఎటువంటి కోతలు లేవని, వేసవిలో సైతం ఎలాంటి కోతలు లేకుండా సరఫరా చేస్తామని చెప్పారు. నీటి కోతలు ఉండవని ఇప్పటికే జలమండలి అధికారులు స్పష్టంగా తెలిపారని ఆయన అన్నారు. పలు ప్రాంతాలలో సాంకేతిక కారణాల వల్ల నల్లాల్లో నీరు రాకపోయే అవకాశం ఉంటుందని, అలాంటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు.

కెనరా బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ ఉద్యోగులు

అబిడ్స్: తమ బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సెక్రటరీ బీఎస్ మదుసూధన్ అన్నారు. బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఆదివారం తెలంగాణ కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ 2వ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులంతా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ బ్యాంక్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీబీఈయూ ప్రధాన కార్యదర్శి కె.శ్రీకృష్ణ, సీజీఎం కేఏస్ పట్నాయక్, బీఎస్ రాంబాబు, ఎంఎస్ శ్రీనివాసన్, సీఎస్ వేణుగోపాల్, యూవీఎస్ఎస్ హరివర్మ తదితరులు పాల్గొన్నారు.

టీ-6, ఎఫ్-24 టికెట్లపై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ ఆంజనేయులు

సంతోష్‌నగర్: ఆర్టీసీ ప్రవేశపెట్టిన నూతన టీ-6, ఎఫ్-24 టికెట్లను సద్వినియోగం చేసుకోవాలని మిధాని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.ఆంజనేయులు సూచించారు. మిధాని ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు ఈ టికెట్ల గురించి ఆదివారం అవగాహన కల్పించారు. కోఠి ఉమెన్స్ కాలేజీ, మెడికల్ కాలేజీ, బస్ టెర్మినల్, బాలాపూర్ ఎక్స్ రోడ్డులో మిధాని ఆర్టీసీ సిబ్బంది కరపత్రాలతో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలులో ఉన్న టీ-24 టికెట్టుకు అదనంగా టీ-6కు రూ.50లతో 18 ఏళ్లు పైబడిన మహిళలు, 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజెన్లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టీ-6 హ్యాపీ అవర్స్ టికెట్టుతో హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, సబర్బన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణించవచ్చన్నారు. ఎఫ్-24 ఫ్యామిలీ టికెట్టు రూ.300లతో నలుగురు కుటుంబ సభ్యులు ప్రయాణించవచ్చని తెలిపారు. కేవలం శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజుల్లో మాత్రమే ఈ అవకాశముందన్నారు. ఈ టికెట్లు ప్రతి బస్సు కండక్టర్ వద్ద అందుబాటులో ఉంటాయని చెప్పారు.

నేడు సేవా కార్యక్రమాలు

గోల్కొండ: దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం నేడు జనహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ తెలిపారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వివేకానందనగర్ భోజగుట్టలో ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఇందులో వివిధ ఆస్పత్రులకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తామని చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.



బాక్సింగ్ క్రీడాకారిణికి సన్మానం



అబిడ్స్: బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కరిష్మారాణి షిండేను ఆదివారం ధూల్‌పేటలో గోషామహల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పప్పుమాత్రే ఆధ్వర్యంలో సత్కరించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో కరిష్మారాణి గోల్డ్ మెడల్ సాధించింది. కార్యక్రమంలో నరేష్‌రావు, సంజు, గోవింద్, కరణ్‌సింగ్, వినోద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తా



అబిడ్స్: ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని గోడేకబర్‌లో డబుల్ బెడ్‌రూంల వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఆశీష్‌కుమార్ ఆయూష్ కేంద్రం పేరిట ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జియాగూడ: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగు చూసింది. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మన్మోహన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ మల్లన్నగుడి ప్రాంతంలో నివసిస్తున్న దశరథ్ శైలాశెట్టి (56) వృత్తిరీత్యా కూలీ. అతడు ఇటీవల అప్పుల బాధతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయట నుంచి వచ్చిన భార్య నాగమణి, పిల్లలు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నారీ సత్కార్ కార్యక్రమం

గోల్కొండ: మహిళలు మరింత శక్తివంతులుగా ఎదిగినప్పుడే వారిపై వేధింపులు, దౌర్జన్యాలు అంతమవుతాయని రైజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పద్మ వీరపనేని అన్నారు. ఆదివారం షేక్‌పేట్ సక్కుబాయ్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారీ సత్కార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్టంగా రాణించిన మహిళలను ఆమె సన్మానించారు. బాక్సర్ నిఖత్ జరీన్, పైలట్ స్వాతిరావు, కళా శ్రీనివాస్, మౌనిక దేవులపల్లి, వాకటి రజితా రెడ్డి, జానుమడేల్, విజయదుర్గ, డాక్టర్ పి.పద్మావతి, పూజా నికేత్కర్‌లను సన్మానించారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి



వీరయ్యను సన్మానిస్తున్న దృశ్యం

నాంపల్లి: నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఇటికాల వీరయ్య ప్రజాపతి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డాక్టర్ జె.పూర్ణచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురు మహిళలకు విశిష్ట వనితా పురస్కారాలు-2023 అందజేశారు. ఐపీఎస్ అధికారిణి సరిత, అవునూరి లక్ష్మీరాజ్యం, నారాయణ, బండారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయడం అభినందనీయం



ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసిన వారి జన్మ ధన్యమవుతుందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. తెలంగాణ చికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా బాధితులకు రక్తం దివ్య ఔషధమని, రక్తదానం చేసిన వారు వారి ప్రాణాలను కాపాడినవారు అవుతారన్నారు. ఈ శిబిరంలో 1500 మంది రక్తదానం చేశారని, వీరిలో యువకులే ఎక్కువగా ఉండడం అభినందనీయమని ఆయన అన్నారు. రత్నావళి కొత్తపల్లి, అలీంబేగ్, ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఎక్బాల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

సుల్తాన్‌బజార్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కాచిగూడ డివిజన్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ఈటీ దర్శన్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాలలో మాదిగల సంగ్రామ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కవులు, కళాకారులకు సముచిత స్థానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులకు సముచిత స్థానం కల్పిస్తుందని రామగుండం ఎమ్మెల్యే కె.చందర్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వసుంధర విజ్ఞాన వికాస మండలి 3వ దశాబ్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చే శక్తి కవులకు, కళాకారులకు ఉందన్నారు. ప్రస్తుతం యువత పెడదారి పడుతుందని, పాఠశాల స్థాయి నుంచే చెడు అలవాట్లకు బానిస కావడం, ర్యాగింగ్ పేరుతో తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నుంచి యువతను బయట పడేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం పలువురికి బాల పురస్కారాలు, కవితా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, పత్తిపాక మోహన్, మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు వైద్యుల మధుకర్‌రెడ్డి, అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684